ప్రజాశక్తి

శనివారం 27 సెప్టెంబర్ 2025 | 5 | విజయనగరం

పోక్సో కేసుల్లో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పోక్సో కేసులో విజయనగరంలోని జమ్మునారాయణపురానికి చెందిన తరిని అప్పారావు(54)కు 20ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి శుక్రవారం తీర్పు చెప్పారు. జమ్ము నారాయణపట్నంలోని ఒక అపార్టుమెంటులో నివాసం ఉంటున్న నిందితుడు తరిని అప్పారావు అదే అపార్టుమెంటులో నివాసం ఉంటున్న బాలిక (70 ను గత ఏడాది నవంబర్ 13న వారింటిలోకి తీసుకొని వెళ్ళి, లైంగిక దాడికి పాల్పడినట్లుగా బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై మహిళా పోలీసు స్టేషను ఎస్ఐ ఎన్.పద్మావతి పోకోకేసు నమోదుచేశారు. అప్పటి డిఎస్పి ఎం.శ్రీనివాస రావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష విధించడంతో పాటు బాధితురాలికి పరిహారంగా రూ.3లక్షలను మంజూరు చేస్తూ తీర్పును వెల్లడించారు. ఈ కేసులో పోలీసుల తరుపున ఫోక్సోకోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు జి.సత్యం వాదనలు వినిపించారు.

తప్పని స్మార్ట్ కష్టాలు

- డీలర్లకూ పని భారమే
- కొత్త ఫీచర్లేమీ లేవంటున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-సంతకవిటి

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్‌కార్డు స్థానంలో తీసుకొచ్చిన స్మార్ట్‌కార్డుల్లో కొత్తదనం ఏమీ కనిపించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ కార్డు ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు ప్రతినెలా అందిస్తున్నారు. అయితే రేషన్ షాపులల్లో వచ్చిన సరుకులు ఎటువంటి అవకతవకలూ జరగకుండా క్యూఆర్ కోడ్ తో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ కార్డుల్లో ఆ కుటుంబం డేటా మొత్తం నిక్షిప్తమై ఉంటుంది. కానీ తంబ్ వేస్తేగాని సరుకులు ఇవ్వని పరిస్థితి నెలకొనడంతో షరా మామూలే అనే చందంగా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అయితే స్మార్ట్ కార్డులు వచ్చినా డీలర్లకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

నియోజకవర్గంలోని మొత్తం 80,595 కార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు 73,797 స్మార్టు కార్డులు పంపిణీ చెయ్యగా 6,798 కార్డులు ఇంకా పెండింగ్ లో ఉన్నాయి. వినియోగదారులకు రేషన్ దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుందని, ఎటువంటి సమస్య వచ్చినా ప్రభుత్వానికి నేరుగా సమస్యలను తెలియజేయవచ్చునని అధికారులు చెప్పారు. అయితే ఈ స్మార్ట్ కార్డులలో ఇకెవైసి స్థితి, రేషన్ కేటాయింపులు, రేషన్ సరుకుల వివరాలను తెలుస్తాయి. అయితే ప్రతి నెలా 15తేదీ లోపే రేషన్ తీసుకోవాలి. లేదంటే రేషన్ ఇవ్వరు. ఇలా 3నెలల్లో గాని రేషన్ తీసుకోక పోతే స్మార్ట్ కార్డు రద్దు చేస్తామని అధికారులు అంటున్నారు. ఇక గ్రామాన్ని వదిలి పనుల కోసం దూరప్రాంతానికి వలస వెళ్లే పేదలు స్మార్ట్‌కార్డు వినియోగించుకునే పరిస్థితి లేదు. దీంతో వారంతా నష్టపోయే ప్రమాదం ఉంది. మరోవైపు స్మార్ట్ కార్డులు రాని వినియోగదారులు పాత రేషన్ కార్డులతోనే రేషన్ సరుకులు అందజేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న కొత్తగా పెళ్లయిన జంటలకు స్మార్ట్‌కార్డులు రాకపోవడంతో వారంతా వాటి కోసం ఎదురు చూస్తున్నారు. కొన్నికార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు తప్పు పడడం, మరికొందరు కొత్త కార్డులకు దరఖాస్తు చేసినా నేటికీ స్మార్ట్ కార్డులు రాకపోవడంతో వారంతా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

స్మార్ట్ కార్డులు ఎటిఎం కార్డుల మాదిరిగా ఉన్నప్పటికీ కొత్త ఫీచర్స్ ఏమీ లేవని వినియోగదారులు చెబుతున్నారు. స్మార్ట్ కార్డుకు చిప్ ఏర్పాటు చేసి, వాటిలో సంక్షేమ పథకాలకు ఉపయోగ పడే డేటాతో పాటు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర డాక్యుమెంట్లకు ఉపయోగపడేటట్లు చేస్తే బాగుండేది. అయితే స్మార్ట్ కార్డు నెంబర్ కొడితే కేవలం రేషన్ షాపుల్లో మాత్రమే ఉపయోగపడేటట్లు చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వ్యయం ఖర్చు చేసినా పేద ప్రజలకు పెద్దగా ఉపయోగ పడలేదనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఇప్పటికే రేషన్ డీలర్లు తంబ్ వేసేటప్పుడు సర్వర్ సాంకేతిక సమస్యలతో వినియోగదారులు, డీలర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు.

డీలర్లకు మరింత పని భారం

రేషన్ షాపుల్లో తరుచూ కొత్త నిబంధనలు పెట్టి సరైన శిక్షణ ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులు పాటు రేషన్ పంపిణీ చేస్తున్నా చాలీ చాలని కమిషన్‌పై ఆధారపడి జీవనం సాగించడం భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ సాంకేతిక సమస్యలతో డీలర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం బస్తాలు గోదాం నుంచి డిపోలకు వెళ్లే క్రమంలో తరుగు వస్తోందని డీలర్లు చెబుతున్నారు. పెద్ద డిపో డీలర్లకు ప్రతినెలా 2 నుంచి 3 క్వింటాళ్లు తరుగు వస్తుందని, దీంతో చేతి డబ్బులతో బయట బియ్యం కొని వినియోగదారులకు పంపిణీ చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు బాధ్యతలు నేర్పాలి

- శిక్షలు కఠినంగా ఉన్నప్పుడే భయం కలుగుతుంది
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల్లో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆడ, మగ పిల్లలకు ఇంటి నుండే బాధ్యతలు నేర్పాలని, తల్లి దండ్రులే ముందు సంస్కారాన్ని నేర్పించి బయటకు పంపిస్తే చెడు పనులు చేయరని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. ఆడ, మగ వివక్ష లేకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇద్దరికీ స్వీయ రక్షణ అవసరం ఉందని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో 8 వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆడవారికి ఆపదలు పక్కనే పొంచి ఉంటున్నాయని, తెలిసిన వారి నుండే ఎక్కువ ముప్పు కలుగుతుందని పేర్కొన్నారు. ఆడవారి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, మహిళలు సురక్షితంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలు పని చేసే చోట కళాశాలల్లో, కార్యాలయాల్లో, ప్రతి సంస్థల్లో మహిళా రక్షణ కమిటీలు తప్పక ఉండాలని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు జరిపిన వారిపై శిక్షలు కఠినంగా ఉండాలని అప్పుడే నేరం చేయడానికి భయం కలుగుతుందని అన్నారు. మహిళా రక్షణకు, ఆరోగ్యానికి, అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని అన్నారు. సోషల్ మీడియా వలన మహిళలకు ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి రవాణా ఖర్చులను మహిళల అవసరాలకు ఉపయోగ పడేలా చేశారన్నారు. గర్భిణులతో దేశానికి సేవ చేసే గొప్ప బిడ్డలను జన్మనివ్వాలని అన్నారు. న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే మహిళలపై లైంగిక వేధింపులకు గురి చేస్తే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు. భార్య భర్తల గొడవలో , ఆస్తుల వివాదాల్లో లోక్ అదాలత్ ద్వారా సర్దుబాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఐసిడిఎస్ పీడీ విమల రాణి , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ హిమ బిందు, మహిళా కమిషన్ డైరెక్టర్ నాగమణి, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డిఆర్‌డిఎ పిడి సావిత్రి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, సిడిపిఒలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందించి సీమంతం చేశారు. అనంతరం కమిషన్ చైర్‌పర్సన్ ప్రభుత్వ ఆసుపత్రి లో నున్న వన్ స్టాప్ సెంటర్ ను సందర్శించారు.

కలెక్టర్ ను కలిసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్

జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన చైర్‌పర్సన్‌కు కలెక్టరేట్ వద్ద జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి స్వాగతం పలికారు. అనంతరం చైర్‌పర్సన్ శైలజ కలెక్టర్‌ను ఆతని ఛాంబర్లో కలుసుకొని వివిధ అంశాలపై చర్చించారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత కోచింగ్ : ఎంపి

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుందని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలో డిఎస్‌సి అభ్యర్థులకు కలిశెట్టి నిఖిల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామీణ గిరిజన ప్రాంతాల అభ్యర్థులకు బెస్ట్ కోచింగ్ టీచర్స్‌తో మంచి భవనంలో కోచింగ్ ఇస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అభ్యర్థులు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్నప్పుడు వారి కళ్ళల్లో ఎంతో ఆనందం కనిపించిందన్నారు. రానున్న నవంబర్‌లో మరో డిఎస్‌సి ప్రకటన ఇవ్వనున్నారని తెలిపారు. డిజిటల్‌బుక్ ఓపెన్ చేసి తాట తీస్తామని చెబుతున్న జగన్‌కు ప్రజలు గత ఐదేళ్లలో తాట తీశారని ఎద్దేవా చేశారు.

విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపి అప్పలనాయుడు

జాతరలో వైద్య శిబిరాలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పైడితల్లమ్మ పండుగ సందర్భంగా 6 ప్రాంతాల్లోను, విజయనగరం ఉత్సవాల సందర్భంగా 15 ప్రాంతాల్లోను వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందితో మూడు షిఫ్టులలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జీవనరాణి ఒక ప్రకటనలో తెలిపారు. పెడితల్లమ్మ పండుగ సందర్భంగా అక్టోబరు 6, 7 తేదిలలో రైల్వే స్టేషను, ఆర్.టి.సి. కాంప్లెక్స్, కోట జంక్షను, అమ్మవారి కోవెల వెనుకవైపు, దాసన్నపేట రోడ్ గుమ్చీ, కృష్ణ టెంపుల్ (కొత్తపేట రాజరావు మేడ) ప్రాంతాలలో మూడు షిఫ్టులలో ఇద్దరు, వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో 24 గంటలు ప్రథమ చికిత్స వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయనగరం ఉత్సవాలు సందర్భంగా అక్టోబరు 5 నుండి 7వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగు వివిధ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ చికిత్స వైద్య శిబిరాల సేవలను ప్రజలు, భక్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు

ఉపాధి సగటు వేతనం పెరగాలి

కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు చెల్లిస్తున్న సగటు వేతనాన్ని పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి ఆదేశించారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం అమలుపై తమ ఛాంబర్లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పథకం అమల్లో జిల్లా స్థితిగతులను, పనుల తీరు, జాబ్ కార్డ్స్, వేతన దారులు, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేతనదారులకు సగటు వేతనం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్ఎం పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనాలను వివరించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మారిన జిఎస్‌టి పై ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపుకారణంగా మారిన ధరల గురించి విస్తతంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. దీనికోసం జిల్లా స్థాయి, నియోజకవర్గ, మండల, మున్సిపల్, గ్రామ స్థాయిలో జిఎస్‌టి ఛాంపియన్లను నియమించాలని, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేథుమాధవన్ మాట్లాడుతూ, జిఎస్‌టి ప్రచారం కోసం ప్రభుత్వం రూపొందించిన 4 వారాల షెడ్యూల్ ను వివరించారు. అక్టోబరు 19న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గొప్ప ముగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ప్రత్యేకాధికారులు, మండలాల నుంచి ఎంపిడిఓలు పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ ఖాదర్ బాబా జయంతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆధ్యాత్మిక జగద్గురు , సూఫీ సెహన్షా హుజూర్ హజరత్ ఖాదర్ బాబ 129 వ జయంతోత్సవ వేడుక శుక్రవారం బాబామెట్ట ఖాదర్ నగర్లో గల ఖాదర్ షా దర్గా దర్బార్ లో కన్నుల పండుగగా జరిగింది. హజరత్ ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డాక్టర్ ఎండి. ఖలీల్ బాబు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు సూఫీ పరంపర అభిషిక్తులు, చీమలపాడు పీఠాధిపతి సజ్జదా నషీన్ ముహమ్మద్ ఖ్వాజా మొహియుద్దీన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం 7 గంటల నుంచి ప్రత్యేక వేడుకలు మొదలయ్యాయి. దర్గాలో ఖాదర్ బాబాకు ప్రత్యేక చాదర్ , సుగంధ గులాబీల సమర్పణ, దర్బార్ లో భారీ కేకు కటింగ్ చేశారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొని, బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఖలీల్‌బాబు తదితరులు

ఎటికె వృద్ధాశ్రమంలో రక్తదాన శిబిరం

ఈ సందర్భంగా ఖాదర్ బాబా దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి (ధర్మకర్త), ఎటికె వెలుగు అనాథ వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ (ఖలీల్ బాబు) నేతృత్వంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ రక్త నిధి కేంద్రం వైద్యురాలు ఎం.వైష్ణవి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో పాల్గొన్న యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రక్త నిధి కేంద్రం బి. అప్పలనాయుడు, ఎస్ మురళీకృష్ణ, జె హరిబాబు, కే మహేష్, షేక్ దరియాబి, చేయూత ఫౌండేషన్ ఎం.రాము, దర్గా దర్బార్ నిర్వాహక నాగేంద్ర బాబాయ్, జానీ బాబు, జైరాజ్, నయీమ్ బాయ్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

నెల్లిమర్ల : ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన సీళ్లను తెరిపించి, లోపల గదుల్లో ఉంచిన ఈవిఎంలను పరిశీలించారు. మొత్తం ఏడు నియోజకవర్గాల గదులను తెరిపించి తనిఖీ చేశారు. అనంతరం దగ్గరుండి సీళ్లను వేయించారు. గోదాములవద్ద భద్రతను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, తాహశీల్దార్ సుదర్శన్, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కర్రావు, ఇతర రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పండగలో పస్తులు ఉండాల్సిందేనా?

- బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి
- కలెక్టరేట్ వద్ద పాఠశాలల ఆయాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్లకు, వాచ్‌మేన్‌లకు జులై నుంచి వేతనాలు బకాయిలు చెల్లించలేదని, వచ్చేది దసరా, పైడితల్లి అమ్మవారి పండగ పూట కూడా వస్తువులతో ఉండాల్సిందేనా అంటూ ఎపి ప్రభుత్వ పాఠశాలలు అండ్ కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి యు .మాణిక్యం నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సుధారాణి, కోశాధికారి ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ స్కూల్ ఆయాలకు, వాచ్‌మేన్‌లకు ప్రతినెలా 10వ తేదీ లోపు జీతం పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. వచ్చేది దసరా, శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ కావడంతో జీతాలు రాకపోవడంతో పస్తులతో ఉండాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ధరల్లో రూ.6వేలతో బతకడం కష్టమని, కనీసం నెలకు రూ.12వేలు జీతం చెల్లించాలన్నారు. 200 మంది కంటే పిల్లల సంఖ్య తగ్గితే ఆయాను తొలగిస్తున్నారని, ఈ నిబంధనతో జిల్లాలో చాలామందికి ఉపాధి పోతుందని, ప్రతి వంద మందికి ఒక ఆయా నియమించే విధంగా నిబంధనలో సడలింపు చేయాలని కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని తొలగించకుండా తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. సెలవుల్లో జీతం కటింగ్ చేసి సగం వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, 12 నెలలకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫామ్, పనిముట్లు ఇవ్వాలని కోరారు. ధర్నాలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె బేగం, వై.నందిని, నాయకులు ఉమా, సరస్వతి, స్వాతి, లక్ష్మి, రమణమ్మ, సావిత్రి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాఠశాలల శానిటేషన్ వర్కర్లు

మత్తు పదార్థాలను నివారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. జిల్లాలో పూర్తిస్థాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. జిల్లా ఎస్‌పి ఎ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ, జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లా మీదుగా గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలను తీసుకున్నామని చెప్పారు. మత్తుపదార్థాలను గుర్తించేందుకు రెండు డాగ్ స్క్వాడ్‌లను కూడా వినియోగిస్తున్నామని తెలిపారు. పాత నేరస్తులపైనా దృష్టి సారించామని చెప్పారు. మత్తుపదార్థాల వినియోగాన్ని మాన్పించేందుకు జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్‌ను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, నేరాలను అరికట్టడంలో మన జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. ముఖ్యంగా మహిళలపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టడంలో 6వ స్థానంలో నిలిచామని చెప్పారు. జిల్లాలో మత్తుపదార్థాలను, గంజాయిని పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి సౌమ్యలత, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటిండెంట్ శ్రీనాథుడు, డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ జీవనరాణి, డిఎస్‌డబ్ల్యూఒ వెంకటేశ్వర్రావు, డిబిసిడబ్ల్యూఓ జ్యోతిశ్రీ, వయోజనవిద్య డిడి సోమేశ్వర్రావు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే...

పుట్టిన బిడ్డ చనిపోయాడంటూ బంధువుల ఆవేదన

ప్రజాశక్తి-పూసపాటిరేగ

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే పుట్టిన వెంటనే తన బిడ్డ చనిపోయాడని మండలంలోని తాళ్ల పేటకు చెందిన వాళ్లే సన్యాసిరావు తో పాటు బంధువులు రెల్లివలస పిహెచ్‌సి వద్ద పసికందును పట్టుకొని శుక్రవారం ఆవేదన వ్యక్తంచేశారు. సన్యాసిరావు భార్య రాధికకు గురువారం రాత్రి 8 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో స్థానికంగా ఉన్న రెల్లి వలస పిహెచ్‌సిలో జాయిన్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున నొప్పులు రావడంతో ఎఎన్ఎం విజయ డెలివరీ చేసేందుకు సిద్ధపడింది. కానీ ఇబ్బందులు ఏర్పడడంతో వైద్యురాలు భాగ్యరేఖను ఫోన్లో సంప్రదించింది. ఉదయం 8గంటల సమయంలో డెలివరీ కష్టంగా మారడం తో విజయనగరం ఘోషా ఆస్పత్రికి పంపించేందుకు 108 కు సమాచారం ఇచ్చారు. తప్పనిసరి పరిస్థితుల్లో 108 సిబ్బంది కష్ట తరంగా డెలివరీ చేయించారు. డాక్టర్ భాగ్యరేఖ బేబీని పరీక్షించి ప్రమాదమని గుర్తించి 108 లో విజయనగరం ఘోషాకు పంపించారు. ఆసుపత్రికి వెళ్లే లోపే బేబి మృతి చెందిందని చెప్పడంతో వారు తిరిగి రెల్లివలస పిహెచ్‌సికి చేరుకొని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యురాలు భాగ్య రేఖ స్పందిస్తూ ఆకస్మికంగా ఐరిస్క్ లోకి వెళ్లడంతో చేయాల్సిన చికిత్సలు చేస్తూనే సుందరపేట గైనకాలజిస్ట్‌ను సంప్రదించా మన్నారు. ఇంతలో 108 సిబ్బంది బేబీని బయటికి తీసారన్నారు. హైరిస్క్ లోకి వెళ్లిపోవడంతో బేబీ చనిపోయిందని తెలిపారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేదన్నారు.

రెల్లివలస పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబీకులు

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

నేటి మధ్యాహ్నం 3.40 గంటలకు విజయనగరం చేరిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

బ్రహ్మపూర్-సూరత్ (ఉద్నా) మధ్య నడిచే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభం కాబోతున్నాయని భారతీయ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రైలు ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ప్రధాన పట్టణాలను కలుస్తూ వ్యాపార, పారిశ్రామిక, శ్రామిక రవాణాను సులభతరం చేస్తుందన్నారు. ఈ రైలు విజయనగరం స్టేషన్ కు శనివారం మధ్యాహ్నం 3.40గంటలకు చేరుతుందని తెలిపారు. జిల్లా వాసులు ఈ రైలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గురుకుల పాఠశాల వార్డెన్లకు, వంట సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టాటా ట్రస్ట్ సహకారంతో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్ లో నిర్వహించారు. ఈ శిబిరంలో ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ కు చెందిన ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, కుక్-కమ్-హెల్పర్లు పాల్గొన్నారు. డిఇఒ యు మాణిక్యం నాయుడు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యకరమైన భోజనానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డిసిఒ ఎం.మాణిక్యం ప్రారంభోపన్యాసం చేశారు. పబ్లిక్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ సీనియర్ ఫెలో డాక్టర్ డి. రాజేష్ కుమార్ కిచెన్ హైజీన్ వంటి అంశాలపై వివరించారు. .

డ్రై డేపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించే విధంగా ప్రజల్లో మరింత విస్తృత అవగాహన తీసుకురావాలని ప్రజారోగ్య సిబ్బందికి కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం అన్ని సచివాలయాల పరిధిలో డ్రైడే పాటించేలా ప్రజలకు ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంటురోగాలు, ఇతర వ్యాధులు ప్రబలడానికి దోమలే ప్రధాన కారణమని అన్నారు. అందువల్ల దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించుకోవాలన్నారు.

సహకార రంగం బలోపేతానికి చర్యలు

డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

ప్రజాశక్తి -కంటోన్మెంట్

సహకారంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు .శుక్రవారం ఉమ్మడి డిసిఎంఎస్ జిల్లా మహాజన సభ డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ గొంపకృష్ణ మాట్లాడుతూ డిసిఎంఎస్ ను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పాత బకాయిలు రికవరీకి చర్యలు తీసుకుంటామన్నారు. 2024-25 డిసిఎంఎస్ ఆడిట్ రిపోర్ట్ ను సభ ఆమోదం తెలిపారు. జిల్లా సహకార అధికారి పి. రమేష్, డివిజనల్ సహకార అధికారి బి.ఈశ్వరరావు, సిఇఒ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మహాజన సభలో మాట్లాడుతున్న డిసిసిబి చైర్మన్ నాగార్జున

పారిశుద్ధ్యంపై దృష్టి : డిపిఒ

మెంటాడ: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, శుభ్రత, తాగునీటి సదుపాయాల మెరుగు దిశగా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జిల్లా డిపిఒ డి.వి. మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం ఆయన మెంటాడ సచివాలయాన్ని సందర్శించారు. ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి యల్. ముత్యాలునాయుడు ఆధ్వర్యంలో ఐవిఆర్ఎస్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య చర్యలు, ఎస్‌డబ్ల్యుపి షెడ్ నిర్వహణ, తాగునీటి సరఫరా, శానిటేషన్ వ్యవస్థలతో పాటు డోర్ టు డోర్ చెత్త సేకరణ విధానం, ప్రతి రోజు క్లోరినేషన్ వంటి అంశాలను పరిశీలించారు. తరువాత పారిశుధ్య కార్మికులను సన్మానించి, స్వామిత్వ సర్వే ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి రాంబాబు, డిప్యూటీ ఎంపిడిఒ విమలకుమారి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ఫ్లెక్సీలను తొలగించండి

శృంగవరపుకోట: మండలంలోని భవానీనగర్ ప్రధాన రహదారికి ఆనుకొని భర్తాపురం మలుపు దగ్గర ఉన్న విద్యుత్ స్తంభానికి పెద్ద ఫ్లెక్సీ కట్టడంతో ఆ మలుపు ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు చెబుతున్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు స్తంభం ఎక్కాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాహనాలపై వచ్చేవారికి మలుపు తిరిగేటప్పుడు రహదారిపైకి వచ్చేవరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడడం లేదని చెబుతున్నారు. ప్రమాదాలు జరిగితే గాని స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి అటువంటి ఇబ్బంది కరమైన ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతున్నారు.

చింతలవలసలో పొలం పిలుస్తోంది

డెంకాడ: మండలంలోని చింతలవలసలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ టి.సంగీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి పంటలో పాముపొడ తెగులు గుర్తించామన్నారు. దీని నివారణకు ఒక లీటర్ నీటికి హెక్సాకొనజోల్ 2ఎంఎల్ 15 రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో పిలక దశలో దుబ్బుకు 10 నుండి 15 దోమలు, ఈనిక దశలో దుబ్బుకు 20 నుండి 25 దోమలు ఉంటే మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి రామకోటి, వ్యవసాయ సహాయకులు దివ్య, ప్రవళిక, రైతులు పాల్గొన్నారు.

టీకాల ప్రక్రియ పరిశీలన

భోగాపురం: మండలంలో పోలిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.దామోదరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం భోగాపురం ఏరియా పశువైద్యశాలలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని భోగాపురం, డెంకాడ మండలాలకు సంబంధించిన సిబ్బంది ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఉమాశంకర మహాపాత్రో, ముంజేరు, పోలిపల్లి, అక్కివరం, డెంకాడ, రఘుమండ పశు వైద్యాధికారులు, రెండు మండలాల పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

విజయనగరం లీగల్: న్యాయ వ్యవస్థలో ఉన్న వ్యక్తులు చనిపోయిన వారికి నివాళులు, సంతాప కార్యక్రమాలను కోర్టులు విధుల ప్రారంభానికి గంట ముందు జరిగేది. ఇది గత ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా జరుగుతువారుంది. ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఇటువంటి కార్యక్రమాలు చేసే సమయాన్ని ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల తరవాత జరుపుకోవాలని ఆదేశాలు జారీచేసింది. జిల్లా కేంద్రంలో, జిల్లాలో ఉన్న అన్ని కోర్టుల్లో న్యాయవాదులు హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. స్థానిక న్యాయ మూర్తులు, ఆయా సంఘ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని స్థానిక సంఘ అధ్యక్షులు కె.రవిబాబు, కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైద్యానికి నోచని గిరిజనులు

ప్రజాశక్తి -శృంగవరపు కోట

దేశవ్యాప్తంగా స్వస్త్‌నారీ స్వశక్తి పరివార్ అభియోగ్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు పెడుతున్న తరుణంలో గిరిశిఖర ప్రాంతాల ప్రజలు వైద్యానికి నోచుకోవడం లేదని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు జరత గౌరీష్ ఆరోపించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల దారపర్తి పంచాయతీ పరిధిలో చిన్నపిల్లలకు, తట్టు వ్యాధికి తట్టుకోలేకపోతున్నారని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చంచలనమే రేపింది. ఈ తరుణంలో వైద్య సేవలందించాల్సిన వైద్యులు స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియోగ్ కార్యక్రమంలో భాగంగా గిరిశిఖర గ్రామాలకు వెళ్లకుండా సంత దారిలో వచ్చే మహిళలను, చెకప్ చేసి ఒప చూపించుకుని వెళ్లిపోవడం దారుణమన్నారు. దసరా సెలవుల నేపథ్యంలో గిరిజన విద్యార్థులు అందరూ గ్రామాల్లో ఉంటారని, వాళ్ల పరిస్థితి వైద్యాధికారులకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ అధికారులపై చర్యలు తీసుకుని, ప్రతి గిరిజన గ్రామానికి వైద్య సదుపాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతిభకు ప్రశంసలు

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకులో మెసెంజర్‌గా నాగరాజు తన విధుల్లో చూపిన ప్రతిభకు బ్రాంచ్ మేనేజర్ బొత్స నాగరాజు శుక్రవారం ప్రశంసలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు బ్యాంకుకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం నాగరాజు ఎనలేని సేవలు అందజేస్తున్నారని బ్యాంకు పురోభివృద్ధికి ఆయన సేవలు ఉపయోగకరం అని అన్నారు. ఇటీవల బ్యాంకు కాగిత రహిత సేవలకు ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో ఆయన చేస్తున్న సేవలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఏటీఎం పిన్ జనరేషన్, పాస్ బుక్ ప్రింటింగ్ వంటి వినియోగదారుల సేవలో ప్రభావం చూపడంతో ఇలా ప్రోత్సాహం ఇస్తున్నట్టు తెలిపారు. ఇంకా మరిన్ని సేవలు కస్టమర్లకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, క్యాష్ ఇంచార్జి హరికృష్ణ, సిబ్బంది లక్ష్మణ నాయుడు, ధర్మారావు, శ్రావణి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు, సోంపురం గ్రామాల్లో శుక్రవారం సమాచార హక్కు చట్టం 2005పై ప్రజలకు వ్యవసాయాధికారి స్వాతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ అక్కునాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు యమున, దేవి పాల్గొన్నారు.

విజయనగరం కోట : రైతులు వారు కోరుకున్న సమాచారాన్ని ప్రభుత్వాధికారుల నుంచి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విజయ నగరం మండలం రాకోడు గ్రామంలో ప్రజలకు సమాచార చట్టంపై అవగాహన కల్పించారు. రైతులకు వారు కోరిన సమాచారాన్ని ప్రభుత్వ సంస్థల నుంచి ఏ విధంగా పొందాలో వివరించారు. కార్యక్రమంలో రాకోడు గ్రామ సర్పంచ్, రైతులు, రాకోడు గ్రామ వ్యవసాయ సహాయకులు శోభ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టుల చుట్టూ తిరగొద్దు

బొబ్బిలి: తగాదాలు తెచ్చుకుని కోర్టుల చుట్టూ తిరగవద్దని జూనియర్ సివిల్ జడ్జి హేమ ప్రవంతి జానకిరామ్ అన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగాదాలు జరగకుండా ఉండే వాతావరణం ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. ఇంటి సమస్యలు కేసులతో పడకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబ పెద్దపై ఉందని చెప్పారు. తగాదాలు తెచ్చుకుని కోర్టుల చుట్టూ తిరగవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం తహశీల్దార్ జె.రాములమ్మ మండల స్థాయి అధికారులతో జిఎస్‌టిపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ పైడిరాజు, ఎపిఎం సన్యాసిరావు, ఎపిఒ అదిలక్ష్మి, వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి, వల్లంపూడి పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిఎస్‌టి పై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

మహిళల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని పాతబగ్గాం, లోగిస గ్రామాల్లో మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనూజ్ రాయ్, శూష్మ పర్యవేక్షణలో 14 రకాల వ్యాధులపై పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 300లకు పైగా రోగులను తనిఖీ చేసి పలు దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరి, సూపర్‌వైజర్ శకుంతల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాత బగ్గాం సర్పంచ్ లెంక పద్మ, అంగన్వాడీలు కనకదుర్గ, శారద, ఎఎన్ఎం ఉమా, ఆశ వర్కర్లు పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మెంటాడ : మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని డాక్టర్ లోకప్రియ అన్నారు. శుక్రవారం మండలంలో జి.టి.పేటలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి ఎల్.ముత్యాలునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో వచ్చిన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి గుర్తించిన వ్యాధులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ టిడిపి నాయకులు చొక్కాకు సన్యాసినాయుడు, ఎఎన్ఎం పార్వతి, ఎంఎల్‌హెచ్‌పి ఫీల్డ్ అసిస్టెంట్ ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, హెల్త్ అసిస్టెంట్, ఆసుపత్రి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఆశాలు, అంగన్‌వాడీలు

వేపాడ: మండలంలోని వావిలిపాడలో శుక్రవారం వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వేణు అధ్యక్షతన స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బిల రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు అందరూ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ వైద్య శిబిరంలో132 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి, కూటమి ప్రభుత్వ నాయకులు, పంచాయతీ కార్యదర్శి జోగారావు, సిహెచ్‌ఒలు పి.రాజ్యలక్ష్మి, బి.పార్థసారథి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పి, హెచ్‌ఎస్, హెచ్ఎలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో జరజాపుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష నేతృత్వంలో, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పర్యవేక్షణలో శుక్రవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అబియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 360 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, మద్దిల వాసు, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి బంగారు, చంద్రశేఖర్, తుమ్ము వెంకటరమణ పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులకు సీమంతం చేసి టిబి వ్యాధిగ్రస్తులకు ఫుడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డెంకాడ, పినతాడివాడ గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎన్.అనూష, కంటి వైద్యులు గణపతి, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ పరిశరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి - చీపురుపల్లి

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఏఆర్.దామోదర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు స్టేషన్ లోపల కంప్యూటర్ రూమ్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రూమ్, స్టాఫ్ వెయిటింగ్ రూమ్ పరిశీలించారు. విక్టిమ్స్ ఏ టైంలో వచ్చినా వారిని రిసీవ్ చేసుకుని వెంటనే మంచిగా మాట్లాడి సహాయం చేయాలని అధికారులకు సూచించారు. రిజిస్టర్ చేసిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి సూచనలు ఇచ్చారు. స్టేషన్ లోపట బయట మంచి వాతావరణం కల్పించినందుకు స్టేషన్‌కి రివార్డ్ ప్రకటించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఎస్.రాఘవులు, సిఐ జి.శంకర్రావు, ఎస్ఐ ఎల్ దామోదర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండేన్ గ్యాస్ పంపిణీలో అధిక వసూళ్లు

- ప్రశ్నిస్తే సిబ్బంది దాడులు
- ట్యూబ్‌కు, గ్యాస్ బండకు లింకులు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో ఉన్న రేణు ఇన్ డేన్ గ్యాస్ ఏజెన్సీ అరాచకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ అధికంగా వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మండల కేంద్రంలో కూడా ప్రతీ సిలిండర్ పై 22 రూపాయలు బిల్లుపై అధికంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కొన్ని కిలోమీటర్ల పరిధిలో ఉచిత పంపిణీ చేయాలి. కానీ వీరు మండల కేంద్రంలో వారి కార్యాలయం, గోడౌన్ పక్కన ఉన్న వినియోగదారులుకైనా రూ. 22 చెల్లిస్తేనే సిలిండర్ ఇస్తామని డెలివరీ బాయ్స్ ఖరా ఖండిగా చెప్పడం విశేషం. ఇప్పుడు ఈ అధిక వసూళ్లతో పాటు గ్యాస్ ట్యూబ్ పేరిట బలవంతంగా రూ.190 చెల్లిస్తేనే సిలిండర్ డెలివరీ చేస్తామని లేదంటే ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నా ఇచ్చే ప్రసక్తే లేదని రుబాబు చేస్తున్నట్లు 'ప్రజాశక్తి'కి శుక్రవారం ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ముఖ్యంగా గొల్లపేట రైతుసంఘం నాయకుడు లెంక ఈశ్వరరావు ఫిర్యాదు చేస్తూ ఇటీవలే ఐఎస్ఐ మార్కు గ్యాస్ ట్యూబ్ కొన్నట్లు చూపించినా డెలివరీ బాయ్ గ్యాస్ బండ ట్యూబ్ కొనకుండా ఇవ్వమని చెప్పి వాగ్వివాదం చేసినట్లు చెప్పారు. బిల్లుపై ఉన్న మొత్తం కన్నా రూ.50 నుంచి 100 వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి డెలివరీ సమయంలో నింపు సిలిండర్ తూకం చూపించేందుకు కాటా కూడా ఉంచడం లేదు. డెలివరీ బాయ్స్‌కు ఏజెన్సీ జీతాలు ఇవ్వకపోవడంతో పాటు, వినియోగదారుల నుంచే జీతాలు సంపాదించుకోవాలని ఆంక్షలు విధించి ఉద్యోగాలు ఇవ్వడం కోస మెరుపు. ఇలా ఏజెన్సీ నిర్వాహకులు అలుసు ఇవ్వడంతో ఆన్‌లైన్ బుక్ చేసుకొని అనివార్య పరిస్థితుల్లో సిలిండర్ పొందని వినియోగదారుల బండలను బ్లాక్ మార్కెట్లో హోటళ్లు, దాబాలకి బాయ్స్ అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గట్టిగా ఎవరైనా ప్రశ్నిస్తే బండ ఇవ్వమని తగువులాటకు వస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఏజెన్సీల అక్రమాలు కట్టడి చేయాల్సిన నిఘా వ్యవస్థ మామూళ్ల మత్తులో నిద్ర పోతున్నంత కాలం ఇలా వినియోగదారుడు నష్టాలు చవి చూడక తప్పదని పలువురు ఉసూరు మంటున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేసి అక్రమ వసూళ్లు నిలుపుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో గ్యాస్ బండలను సరఫరా చేస్తున్న వ్యాన్

కేంద్రప్రభుత్వ ఆదేశాలు పాటిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల రక్షణ కోసం కొత్త గ్యాస్ ట్యూబ్‌లు పంపిణీ చేయాలని దీని ఖరీదు రూ.190 వసూలు చేయాలనే నిబంధన మేరకు అమ్మకాలు చేస్తున్నాం. ప్రమాదాల నివారణ బీమా చెల్లింపు సక్రమంగా ఉండేందుకు ఈ సురక్షా ట్యూబ్ వాడాలి.

- శాంతకుమారి, ఏజెన్సీ నిర్వాహకురాలు, రామభద్రపురం

ఆర్ఒ ప్లాంట్ల తనిఖీ

విజయనగరం టౌన్ : నగర పరిధిలో ఉన్న ఆర్ఒ ప్లాంట్లను తనిఖీ చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల విస్తరించిన డయేరియా కేసులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సురక్షితమైన నీటిని అందించే ప్రయత్నంలో భాగమే ఆర్ఒ ప్లాంట్ల తనిఖీ ప్రక్రియ అని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు.

వీధి కుక్కలు పట్టివేత

విజయనగరం టౌన్: నగరంలో పలు ప్రాంతాలలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో ప్రత్యేక సిబ్బంది వీధి కుక్కలను అదుపులోకి తీసుకొనే ప్రక్రియ చేపట్టారు. శుక్రవారం పలు ప్రాంతాలలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను గుర్తించి, వాటిని పట్టుకొని కొత్తపేటలో ఉన్న డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలతో పాటు, యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ వేస్తారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - బొబ్బిలి

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం లోక కళ్యాణం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డ్వాక్రా మహిళలు, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమిషనర్ రామలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకుని వెళ్లాలని కోరారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ హెూటల్స్, రెస్టారెంట్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహారంలో రంగులు, టేస్ట్ సాల్ట్ వేసిన కేసులు నమోదు చేస్తామన్నారు. వీధి విక్రయదారుల సంఘం నాయకులు ఎం.శ్రీను మాట్లాడుతూ వీధులు, రోడ్ల పక్కన వ్యాపారం చేసుకుని జీవనం సాగించే వారిని ఇబ్బందులు పెట్టవద్దన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సమన్వ యంతో ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ చిట్టిరాజు, కౌన్సిలర్లు, బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతులందరికీ పరిహారం అందలేదు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

జిందాల్ భూములిచ్చిన నిర్వాసిత రైతులందరికీ పరిహారం అందలేదని నిర్వాసితులు చెప్పారు. మండలంలోని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు 98వ రోజు శుక్రవారం నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూములు తీసుకుని పరిహారం ఇవ్వలేదని, తక్షణమే ప్రభుత్వం జిందాల్‌కి చేసిన రిజిస్ట్రేషన్‌లు రద్దు చేసి తమ భూములు తమకి అధికార పూర్వకంగా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ పేరుతో భూములు తీసుకుని 18 సంవత్సరాలు అయినా కంపెనీ కట్టకుండా, నేడు ఎంఎస్ఎంఇ పార్క్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా, గ్రామ సభల్లో చర్చించకుండా ఇచ్చిన జిఒ నెంబర్ 14ను తక్షణమే రద్దు చేయాలన్నారు. తమకి ఇంత అన్యాయం జరుగుతున్నా, గత మూడు నెలలుగా నిరసన తెలుపుతున్నా, ప్రభుత్వ అధికారులు తమని పట్టించుకోకుండా కంపెనీకి వత్తాసు పలుకుతూ పోలీసుల చేత తమను బెదిరిస్తున్నారని ఆగ్రహించారు.

తమకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని, ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ సమస్యలపై తక్షణమే స్పందించి, పరిష్కారం చూపకపోతే నిరహార దీక్షలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలి

స్టేషన్ ఇన్‌ఛార్జికి ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు పి.శంకరరావు, వేమిరెడ్డి లక్ష్మీనాయుడు, వి. శేషగిరి, ఎస్ గోపాల్ అన్నారు. శుక్రవారం రైల్వే స్టేషన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ స్టేషన్ ఇన్‌ఛార్జి కోటేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలిని మోడల్ రైల్వే స్టేషన్‌గా మారుస్తున్నామని చాలా సౌకర్యాలు వస్తాయని రైల్వే అధికారులు ప్రకటించినా ఆ దిశగా అడుగులు పడలేదన్నారు. కనీసం లిఫ్ట్ సౌకర్యం కూడా లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్టేషన్‌లో వైద్య సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం వంటివి ఏమీ లేవన్నారు. విశాఖపట్నం వైపు వెళ్లే ట్రైన్స్ అన్ని తెల్లవారి 8 గంటలులోపే వెళ్తున్నాయని మళ్లీ మధ్యాహ్నం రెండు వరకు ఒక్క ట్రైన్ కూడా లేదని చెప్పారు. భవానిపట్నం, విశాఖపట్నం ఉదయం 9గంటలకు వచ్చేటట్లు టైమ్‌ను మార్చాలని, సాయంత్రం విశాఖపట్నం నుండి బయలుదేరే దుర్గ్ ఎక్స్‌ప్రెస్‌కు ముందు విశాఖపట్నం భవానిపట్నం టైంను మార్చి విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉండే టైం పెటాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి నుంచి విశాఖకు రోజూ వేలాది మంది ప్రయాణం చేస్తున్నారని ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని బొబ్బిలి విశాఖపట్నం పాసింజర్ ట్రైన్ నడపాలని కోరారు.

స్టేషన్ ఇన్‌ఛార్జికి వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

ఎంవిజిఆర్‌లో 'హ్యాక్‌థాన్'

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలస ఎంవిజిఆర్ కళాశాలలో ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 150 జట్లు పాల్గొనగా 50 జట్లు విజయం సాధించి జాతీయ వేదిక పోటీల్లో తమ స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వైఎంసి శేఖర్ మాట్లాడుతూ తరగతి గదులు, పాఠ్య పుస్తకాలకు మించి ఆలోచించాలని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, క్లీన్ టెక్నాలజీలు, కృత్రిమ మేధస్సు, బ్లాక్ హెచ్చీయన్‌కు ఉన్న సవాళ్లను పరిష్కరించడానికి ఏటా జాతీయ స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. ఎంవిజిఆర్ ఎస్ఐహెచ్ఎం వంశీకృష్ణ ఎంపిక చేసిన జట్లను ప్రకటించారు. అర్హత సాధించిన జట్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్ రమేష్, ప్రోవోస్ట్ ఐసి కన్వీనర్ డాక్టర్ ఎం.శివ సుబ్రహ్మణ్యం, ఐఐసి కన్వీనర్ డాక్టర్ జి.పవన్ కుమార్, విభాగది పతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు భవనాలకు నిధులు కేటాయించండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఎస్.కోట, కొత్తవలస ప్రభుత్వ కోర్ట్ భవనాలకు త్వరితగతిన నిధులు కేటాయించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శుక్రవారం కోరారు. నియోజకవర్గంలో గల కొత్తవలస, ఎస్.కోట ప్రభుత్వ కోర్ట్ భవనాలు 30 సంవత్సరాల క్రితమవని, రెండు భవనాలు శిథిలావస్థలో ఉన్నందున ఎస్.కోట, కొత్తవలస కోర్టులు ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారని దీని ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను సభ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గజపతినగరం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని సర్పంచ్ గేదెల ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కాలం రాజుపేట పంచాయతీ పరిధిలో ఉన్న డోలపాలెం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. పారిశుధ్య పనులను సర్పంచ్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్థలం కేటాయిస్తే మెప్మా బజారు ఏర్పాటు

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలో స్థలం ఇస్తే మెప్మా బజార్ ఏర్పాటు చేస్తామని మెప్మా పీడీ చిట్టిరాజు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సభ్యులు నుంచి మెప్మా బజార్ ఏర్పాటుకు రూ.18లక్షలు వసూలు చేశామని, స్థలం లేకపోవడంతో ఏర్పాటు చేయలేదని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తృప్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తృప్తి క్యాంటీన్ ఏర్పాటుకు రూ.16 నుంచి రూ.18లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. డ్వాక్రా సభ్యులకు ఇచ్చిన బ్యాంక్ లింకేజీ రుణాలు 98 శాతం రికవరీ అవుతుందన్నారు. మెప్మా బజార్ కోసం విజయనగరం కార్పొరేషన్‌లో రూ.27 లక్షలు వసూలు చేస్తే తిరిగి డ్వాక్రా సభ్యులకు ఇచ్చేసినట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలను లాక్షాధికారులను చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

కదిలారు.. వెలుగునిచ్చారు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న శ్రీనివాస కాలనీలో వీధి లైట్లు వెలగకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు ప్రజాశక్తిని సంప్రదించగా అంధకారంలో శ్రీనివాస కాలనీ అనే వార్త ప్రజాశక్తిలో వెలువడింది. దీంతో పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధ స్పందించి శ్రీనివాస కాలనీలో పాడైపోయిన వీధిలైట్ల స్థానంలో శుక్రవారం కొత్త వాటిని ఏర్పాటు చేసి శ్రీనివాస కాలనీకి మరల వెలుగును తీసుకురావడంతో కాలనీవాసులు ప్రజాశక్తి రిపోర్టర్‌కు పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధకు కృతజ్ఞతలు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - వంగర

ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మండల పరిషత్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల నిరుద్యోగులు అల్లాడిపోతున్నారన్నారు. 50 ఏళ్ల నిండిన వారికి పింఛను మంజూరు చేస్తామన్న హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయని విమర్శించారు. రైతులు యూరియా కోసం అనేక అవస్థలు పడుతుంటే కనీసం పట్టించుకోకపోవడం ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరుపై ప్రజలు ప్రతిఘటిస్తుంటే అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై మాట్లాడే తీరు సరిగా లేదన్నారు.

అధికారులకు బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్‌కు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజ్యాంగం అమలు చేసేలా అధికారులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ వినతి అందజేశారు. శుక్రవారం జిల్లా గో సంరక్షణ సమాఖ్య కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆవులను కాపాడాలని పొందుపరిచినప్పటికీ కంటోన్మెంట్‌లో తెలకల వీధి, ఎ1 బిరియాని సెంటర్ వెనుక బ్లూ గేట్‌లలో, షాలిమార్ హోటల్ పక్క సందులలో పెద్ద ఆవు మాంసం దుకాణాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు వందల ఆవులు, దూడలను నరికి చంపి మాంసం కంపెనీలకు పంపిస్తున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కెవిఆర్ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మద్దెల సోంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు గండి కోట శాంతి, పట్టణ మహిళా అధ్యక్షురాలు నీలాపు దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని కవులువాడ అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీ, అవంతి పాలిటెక్నికల్ కాలేజీలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెఎన్‌టియు విజయనగరం డైరెక్టర్ డాక్టర్ కె. చంద్రభూషణరావు, బ్రహ్మకుమారీస్ విశాఖ ప్రతినిధి సిస్టర్ పార్వతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బల్ల అప్పారావు హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులు, గురువులంటే క్రమశిక్షణ, గౌరవం, ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే తపన విద్యార్థులకు మెండుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అవంతి కళాశాలల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని దమరసింగి గ్రామానికి చెందిన పిన్నింటి సత్యనారాయణ (27) పురుగుల మందు తాగి మృతి చెందాడు. వారం రోజులు క్రితం ఇంటి వద్ద పెళ్లి విషయంలో తీవ్ర మనస్థాపం చెంది పురుగుల మందు సేవించాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ గురువారం అర్థరాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాపీ మేస్త్రీ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - బొబ్బిలి

స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మరణించిన తాపీ మేస్త్రీ వర్రి మధు మృతదేహం శుక్రవారం లభ్యమైంది. గొల్లపల్లికు చెందిన మధు తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వెంగళసాగర్ చెరువులో స్నానం చేసేందుకు గురువారం వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభులు చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువు గట్టుపై సైకిల్, బట్టలు ఉన్నప్పటికీ మనిషి లేకపోవడంతో తండ్రి దాడియ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పడవ సహాయంతో చెరువులో మృతదేహం కోసం గాలించినప్పటికి లభ్యం కాలేదు. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ పెద్దదిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. ఎఎస్ఐ కొండలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 రెస్టారెంట్లపై కేసులు

బొబ్బిలి: కల్తీ ఆహారం విక్రయిస్తున్న ఎనిమిది రెస్టారెంట్లపై కేసులు నమోదు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరమణ చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెస్టారెంట్, హెూటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తయారు చేసే ఆహారంలో రంగు, టేస్టీ సాల్ట్ కలిపిన, నిల్వ చేసిన ఆహారాన్ని, మాంసం, చేపలను అమ్మినా కేసులు నమోదు చేస్తామన్నారు. తన పరిధిలో 28 కేసులు నమోదు చేశామని, 10 కేసులు విచారణ పూర్తి అయిందన్నారు. ఒకరికి కోర్టు శిక్ష వేసినట్లు చెప్పారు. 18 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రీసైక్లింగ్ నూనె వాడ వద్దని కోరారు. ఎక్కడ ఆహారం కల్తీ జరిగిన 9440318273కు ఫిర్యాదు చేయాలన్నారు.

జర్నలిస్టు మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న పాపల సత్యనారాయణ (75) గురువారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి దినపత్రికల్లో సుమారు 35 సంవత్సరాలు పనిచేశారు. ఈయనకు భార్య అచ్చియమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

126 పోలింగ్ కేంద్రాల్లో అధిక ఓటర్లు

డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ జరుగుతుందని, దీనికి రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించే ప్రక్రియ మొదలయిందని చెప్పారు. జిల్లాలో మొత్తం 126 పోలింగ్ కేంద్రాల్లో 1200 కంటే ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆయాచోట్ల అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విధంగా జిల్లాలోని రాజాం నియోజకవర్గంలో 17, బొబ్బిలిలో 27, చీపురుపల్లిలో 4, గజపతినగరంలో 3, నెల్లిమర్లలో 4, విజయనగరంలో 61, ఎస్.కోట నియోజకవర్గంలో 10 మొత్తం 126 పోలింగ్ కేంద్రాల్లో 1200 కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, తరలింపులు, కొత్త కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కొత్తగా ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులు చేయడానికి చేసిన దరఖాస్తుల స్థితిగతులను ఎన్నికల కమిషన్ వెబ్సైట్లో తెలుసుకోవచ్చునని డీఆర్వో సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ భాస్కర్రావు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

బాడీ బిల్డింగ్ విజేతలకు కోలగట్ల అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24న పశ్చిమ గోదావరి భీమవరంలో జరిగిన ఓపెన్ మిస్టర్ఆంధ్రా పోటీలలో విజయనగరం నుంచి వెళ్లిన బాడీబిల్డర్స్ సత్తా చాటి బహుమతులు గెలుచుకొని వచ్చిన సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభినందించారు. బహుమతులను గెలిచిన వారిలో వరుసగా వరుణ్ మేన్స్ ఫిజిక్ మోడలింగ్లో గోల్డ్ మెడల్ అండ్ ఓవరాల్ టైటిల్ ఎలక్ట్రికల్ స్కూటీ ని గెలుచుకున్నారు. పి.వంశీ 60 కేజీల భాగంలో రెండోస్థానం కైవసం చేసుకోగా, ఎస్.రమేష్ 55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఎస్.కె సుభాన్ 8 కేజీలు విభాగంలో మూడో స్థానం,ఫిజికల్ ఛాలెంజ్‌లో సాయి గోల్డ్ మెడల్ సాధించారు.వీరిని కోలగట్ల వీరభద్ర స్వామి అభినందిస్తూ ఇదేవిధంగా రాష్ట్ర మరియు జాతీయస్థాయి పోటీలలో విజయనగరం జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. విజయనగరం జిల్లా బాడీ బిల్డింగ్ అధ్యక్షులు కనకల గౌరీకృష్ణ ధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి రమేష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ వర్మ తో పాటు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

రైతు సంక్షేమమే లక్ష్యం : కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం

రైతు సంక్షేమమే తమ ప్రథమ లక్ష్యం అని, రైతుల ప్రయోజనాల కోసం కొత్త ప్రాజెక్టులు, పథకాలు అమలు చేస్తామని మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు అన్నారు. శుక్రవారం విజయవాడలోని మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయంలో మార్క్‌ఫెడ్ బోర్డు డైరెక్టర్లు అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు మద్దతు, పంటలకు న్యాయపరమైన ధరల కల్పన, మార్కెట్ విస్తరణ, సహకార రంగ బలోపేతంపై విస్తతంగా చర్చించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ ఎండి మణిజీర్ జిలానీ, జిఎం శ్రీనివాసరావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

1998 డిఎస్‌సి ఎస్‌జిటి, ఎంటిఎస్ ఉపాధ్యాయుల సర్వీసు క్రమబద్ధీకరణ చేయాలని ఎమ్మెల్యే బేబినాయనను ఎంటిఎస్ ఉపాధ్యాయులు కోరారు. అమరావతిలో శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ చేసి 62ఏళ్లకు సర్వీసు పెంచాలని, 12నెలలు వేతనం వచ్చేలా చూడాలని కోరారు. 11నెలలు జీతం ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్న తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బేబినాయన హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు వినతినిస్తున్న ఉపాధ్యాయులు

డిగ్రీ రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపు కోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు రెండు విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని 29 నుంచి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని కళాశాలకు వస్తే ఉచితంగా కళాశాలలోనే రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు బీకాంలో చేరే విద్యార్థులు 9000224642, బిఏలో చేరే విద్యార్థులు 72078 80690, బిఎస్‌సిలో చేరే విద్యార్థులు 94753 54647 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పైనాపిల్ పంట బాగుంది

ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ ద్వారా పంపిణీ చేసిన కొత్తరకం మారిషస్ పైనాపిల్ పంట బాగుందని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బిల్లగూడ, ఇప్పగూడ గ్రామాల్లో సాగు చేస్తున్న పైనాపిల్ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగు విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. సక్రమమైన పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని అన్నారు. దీనిద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని అన్నారు. జీడి, మామిడి పునరుద్ధరణ పథకంలో భాగంగా జీడి, మామిడి పంట అధిక దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు పిఒ తెలిపారు. వచ్చే ఏడాది సీతంపేట మండలంలో ఈతమానుగూడ, కీసరజోడు, బిల్లగూడ, భామిని మండలంలో పాలిష్‌కోట, నల్లరాయిగూడ, మనుమకొండ గ్రామాల్లో జీడి మామిడిని ప్రయోగాత్మకంగా సాగు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రతి చెట్టుకు రెండు నుంచి మూడు కిలోల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. అనంతరం సీతంపేట తురాయపువలస ఉద్యానవన నర్సరీని పరిశీలించారు. అక్కడున్న మొక్కలను పరిశీలించి, అంటుకట్టు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఉద్యాన శాఖ అధికారి ఎస్.వి గణేష్, హెచ్‌ఒ జయశ్రీ, రైతులు తోట మొఖలింగం, పార్వతి, శీను తదితరులు పాల్గొన్నారు.

పైనాపిల్ తోటను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పిఒని కలిసిన గిరిజన ఐక్యవేదిక నాయకులు

సీతంపేట ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను గిరిజన ఐక్యవేదిక నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.తేజేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ, మన్యం జిల్లా ఎస్‌టి విజిలెన్స్ మానిటింగ్ సభ్యులు శ్రీనివాసరావు, రామారావు, తులసయ్య.. పిఒను ఛాంబర్‌లో కలిసి, సత్కరించారు. అన్ని గిరిజన సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని కోరారు.

పత్తిలో ఆకుముడత తెగులు

ప్రజాశక్తి-మక్కువ

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పత్తి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. పలుచోట్ల అధిక వర్షాల వల్ల పొలంలో నీరు చేరడంతో మొక్కలు చాలా వరకు చనిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆకుముడత, కిల్లి ఆకు తెగుళ్లతో పురుగు ప్రవేశించి పంటలకు నష్టం చేకూరుస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగుళ్ల నివారణకు సస్యరక్షణ మందులు పిచికారీ చేస్తే సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ భారతి సూచించారు. ప్రోఫనపాస్, సైప్రో మెత్రిన్ ద్రావణాన్ని ఎకరాకు 400 ఎంఎల్ తీసుకోవాలని రైతులకు తెలిపారు. 15 లీటర్ల వాటర్ ట్యాంకులో 30 మిల్లీలీటర్ల మందును కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. పంటలకు ఏ విధమైన తెగులు సోకినా రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలపాలని రైతులకు సూచించారు.

ఆకుముడత తెగులు సోకిన పత్తి పంట

జీవనశైలి మార్పుతో ఆరోగ్యం సొంతం

డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

వైద్య సేవలపై ఆరాతీస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-సీతానగరం

ఆరోగ్యకరమైన జీవనశైలితో వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు వెల్లడించారు. పెదభోగిలిలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద అందజేస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు పరిశీలించారు. ఎంత మంది వైద్య సేవలు వినియోగించుకున్నారో రికార్డులో పరిశీలించి, అందుతున్న సేవలపై, వారి అనారోగ్య సమస్యలపై అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమ వివరాల ఆన్‌లైన్ నమోదు తీరుపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు ఆరోగ్య సూత్రాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సరైన జీవన శైలి, ఆహార నియమావళి పాటించాలన్నారు. నూనె, కొవ్వుతో కూడిన, తీపి పదార్థాలు ఆహారంలో సాధ్యమైనంత వరకు తగ్గించాలని చెప్పారు. ఉప్పు కూడా మితంగా వాడాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రోజులో కనీసం కొంత శారీరక శ్రమ ఉండాలని, నీరు ఎప్పటికపుడు తాగాలని అన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. దినచర్యలో వీటిని అలవాటుగా మార్చుకోవాలని, తద్వారా దీర్ఘకాలిక రోగాలు, కేన్సర్ బారిన పడకుండా, ఇంకా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహనరావు, వైద్యాధికారి ఉషారాణి, సిహెచ్‌ఒ ఎస్‌వి రమణ, సూపర్వైజర్ భవాని, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

280 మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం : మండలంలోని బిటివాడ, తూడి గ్రామాల్లో శుక్రవారం ఎస్ఎన్ఎస్‌పిఎ కార్యక్రమంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సుమారు 280 మందికి వైద్యాధికారులు ఎ.మానస, పి.గణేష్, గౌతమ్ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిర, లలిత కుమారి, చినబాబు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం.. రోగులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి మానస

కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

ప్రజాశక్తి-సాలూరు

నిత్యం పట్టణ పరిశుభ్రత కోసం శ్రమించే మున్సిపల్ కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ-2025లో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రియాంక, మాధురి కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కమిషనర్ టి.టి. రత్నకుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ పాల్గొన్నారు.

విశ్రాంతి భవనం ప్రారంభం

విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కరణం బాబ్జి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో గొట్టుమంగళపురం గ్రామంలో విశ్రాంతి భవనాన్ని శుక్రవారం సర్పంచ్ కరణం బాబ్జి ప్రారంభించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, పంచాయతీ కార్యదర్శి బి .వెంకటరమణ వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణం కార్మిక సంఘం బాధ్యత తీసుకున్నప్పటికీ, సుమారు 77 మంది దాతల సహాయంతో నిర్మించినట్లు తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ గొర్లి రవికుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మజ్జి వీరనాయుడు, కార్యదర్శి బబ్బాది శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని భవనాలు

బిల్లులు అందక కాంట్రాక్టర్లకు ఇబ్బందులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పంచాయతీ భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆ భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు ప్రభుత్వం చెల్లించక వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మొదట విడుదల 24 పంచాయతీలకు ఉపాధి హామీ నిధులతో పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీకి పక్కా భవనాలు ఉండాలని భవన నిర్మాణం కోసం రూ.11 లక్షలు చొప్పున మంజూరు చేసింది. మండలంలో బూర్జ, రామవరం, రంగంపేట, దయానిధి పురం, ఎస్ఎస్ఆర్ పురం, ఆర్.వెంకంపేట, చినబోగిలి, సూరంపేట, పాపంవలస, ఇప్పలవలస, బగ్గందొరవలస, ఆర్.వెంకంపేట తదితర గ్రామాలలో పంచాయతీ భవనాలు నిర్మాణాలు పూర్తిచేశారు. కొన్ని భవనాలు ప్రారంభానికి నోచుకున్నాయి. రామవరం, బూర్జ పంచాయతీ భవనాలు నిర్మాణాలు పూర్తిచేసుకుని ప్రారంభానికి నోచుకోలేదు.

రామవరం పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ కొల్లి సురేష్‌కు నేటికీ నాలుగు లక్షల రూపాయలు బిల్లు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో వర్క్ ఐడి పేరుతో ఆ భవనాలను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో ఏ కాంట్రాక్టరుకు రావలసిన బకాయిలూ రాలేదని ఆయన తెలిపారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గతంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని సురేష్ కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోలేని రామవరం పంచాయతీ భవనం

చిరుధాన్యాల కేఫ్ ను ప్రారంభిస్తున్న డిఆర్‌డిఎ పీడీ సుధారాణి

చిరుధాన్యాల కేఫ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చిరుధాన్యాల కేఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఎ పీడీ సుధారాణి కోరారు. శుక్రవారం మండలంలోని మండ గ్రామంలో చిరుధాన్యాల కేఫ్‌ను ఆమె ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఇటువంటి ఆర్థిక వనరులను కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్ డిపిఎం శ్రీనివాసరావు, వెలుగు ఎపిఎం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు నేషనల్ సేవా ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలోని హోటల్ దస్పల్లాలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలలో పట్టణానికి చెందిన గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో), సెంటర్ ఫర్ యోగ అండ్ మెడిటేషన్ (సిమ్) స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ నేషనల్ సేవా ఐకాన్ అవార్డును పొందారు. రెండు దశాబ్దాలకు పైగా పర్యావరణం, యోగా, ఆరోగ్య రంగాల్లో చేస్తున్న సేవలకు ఎపి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రీజనల్ డైరెక్టర్ జివిబి జగదీష్, జిల్లా టూరిజం అధికారి యమ్. మాధవి, డాక్టర్ హరిప్రసాద్, వాస్తు రత్నభూషణ్ డాక్టర్ పట్నాయిక్, నారాయణమూర్తి, ప్రముఖ దర్శకుడు డాక్టర్ మణి భూషణ్ కుమార్ చేతుల మీదుగా నేషనల్ సేవా ఐకాన్ పురస్కారాన్ని, ధృవపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

యూరియాపై ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని ఎఒ పి.శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది 900 టన్నులు యూరియా కోసం ఇండెంట్ పెట్టి ఆర్ఎస్‌కెల ద్వారా ఇప్పటి వరకూ 300 టన్నులు పంపిణీ చేశామన్నారు. ప్రయివేట్ డీలర్ల ద్వారా 350 టన్నులు యూరియా ఇచ్చినట్లు తెలిపారు. మూడవ దశలో 250 టన్నులు ఇండెంట్ పెట్టినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం వరి పంట దుబ్బు చేసుకునే దశ నుండి పాలు పోసుకునే దశలో ఉందని ఎంటియు 1121 రకంలో ఆకు ముడత, పాము పొడ తెగుళ్ల నివారణకు ప్రోఫినోపాస్ 50 శాతం, ఈపిఎస్‌పి - 400 గ్రాములు, ప్రోపికోనజోల్ 5శాతం ఈసి - 200 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి 200 లీటర్ల మందు ద్రావణం ఒక ఎకరా పొలంలో పిచికారి చేసుకోవాలని సూచించారు.

డిఎస్‌సి నియామకపత్రం అందజేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టు వచ్చిన రెడ్డి శివకుమార్‌కు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం రెడ్డి శివకుమార్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-సాలూరు

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీషా తెలిపారు. శుక్రవారం మండలంలో కురుకుట్టి, తోణాం రైతు సేవా కేంద్రాల పరిధిలోని కురుకుట్టి, గుడ్డంగానివలస, బొర్రమామిడివలస గ్రామాలలో పొలం పిలుస్తోంది, జాతీయ ఆహార భద్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈ నెలాఖరులోపు తమ పంటలను తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. యూరియాకు బదులుగా నానో యూరియాను వాడడం వల్ల పంటకు కావాల్సిన నత్రజని లభించడమే కాకుండా, భూమి, గాలి కాలుష్యం కూడా తగ్గుతాయని వివరించారు.

వంశధార నది మార్గంలో దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి -భామిని

మండలంలో పసుకుడి గ్రామంలో వంశధార నదికి వెళ్లే మార్గంలో ఇటీవల విద్యుత్ సిబ్బంది స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ స్తంభాలకు పసుకుడి సర్పంచ్ బెవర భార్గవ నాయుడు శుక్రవారం వీధి దీపాలను అమర్చారు. కార్తీక మాసంలో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున వంశధార నది స్నానానికి వెళుతుంటారని, వారికి ఇబ్బంది లేకుండా వీధి దీపాలు ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు.

శిక్షణకు ఎంపికలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఇటీవల ఎపిఎస్ఆర్‌టిసిలో ఐటిఐ అప్రెంటిస్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో అర్హత మేరకు ఎంపికైన వారిని అలాట్‌మెంట్ చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పనిపై దృష్టి పెట్టి, శిక్షణను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు డిపిటిఒ చేతుల మీదుగా జిల్లాలోని డిపోలకు అలాట్మెంట్ పత్రాలను అందజేశారు.

అలాట్‌మెంట్ పత్రాలను అందజేస్తున్న డిపిటిఒ వెంకటేశ్వరరావు

రోడ్డుపై ఛిద్రమైన గొర్రెల కళేబరాలు

లారీ ఢీకొని 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పసుకుడి గ్రామ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున లారీ ఢీకొని 12 మేకలు మృతిచెందాయి. ఈ మేకలు పసుకుడి గ్రామానికి చెందిన గంట వెంకట్‌వి. వెంకట్ కుటుంబానికి మేకలే ప్రధాన జీవనాధారం. చనిపోయిన మేకల విలువ రూ.లక్షా 30 వేలు ఉంటుందని వెంకట్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సు కిందపడి వృద్ధురాలు దుర్మరణం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని తాలాడ గ్రామం వద్ద శుక్రవారం ఆర్‌టిసి బస్సు కింద పడి కోన మహాలక్ష్మి(70) మృతిచెందింది. ఒడిశాలోని కొరమ గ్రామానికి చెందిన కోన మహాలక్ష్మి తాళాల వద్ద ఉన్న కుమార్తె ఇంటికి బంధువుల పరామర్శ నిమిత్తం వచ్చింది. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో, ఆటో ఎక్కబోయి ప్రమాదవశాత్తూ బస్సు కింద పడి మరణించింది. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని వీరఘట్టం రోడ్డులో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని ఎస్ఐ ప్రేమమూర్తి గుర్తించారు. ఇటుకల బట్టి కంపు వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఉన్నట్లు గుర్తించి వెలికి తీశారు. మక్కువ ప్రాంతానికి చెందిన రవి అనే వ్యక్తి కూలి పనులు చేస్తున్నట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.